క్లుప్తంగా

నేడు విద్యుత్ అంతరాయం

చిట్వేలి : మండల పరిధిలోని పత్తిగుంటవారిపల్లి 33 కేవీ ఫీడర్ మరమ్మతులు కారణంగా మంగళవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని మండల విద్యుత్ శాఖ ఏఈ చలపతిరావు ఓ ప్రకటనలో తెలియజేశారు. ఈ మేరకు పత్తిగుంటవారిపల్లి పరిధిలో ఉన్న పోలోపల్లి, పత్తిగుంటవారిపల్లి, ఈడిగపల్లి, గరుగుపల్లి గ్రామాలలో విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఏఈ చలపతి కోరారు.

10 నుంచి మతాంగ పీఠాధిపతి చాతుర్మాస దీక్ష

లక్కిరెడ్డిపల్లి : మండల పరిధిలోని దొర్రిచెరువు సమీపంలో వెలసిన మతాంగ మహాపీఠాధిపతి మతాంగ నందగిరి స్వామి ఈనెల 10వ తేదీ నుంచి చాతుర్మాస దీక్ష ప్రారంభించనున్నట్లు మతాంగ పీఠాధిపతి మతాంగ నందగిరితో పాటు పీఠం ధర్మాధికారి డాక్టర్ ఏవీ సుబ్బారెడ్డిలు సోమవారం తెలియజేశారు. చాతుర్మాస దీక్ష ప్రారంభం రోజు నుంచి ప్రతి రోజూ మాతాంగ మహాపీఠంలో అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన లాంటి పూజలతోపాటు భక్తి ప్రవచనాలు, భజన, ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరగనున్నాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ రవీంద్రనాథ్ రెడ్డి, సాంబశివ తదితరులు పాల్గొన్నారు.

పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



టెంకాయ చెట్లను నాటుతున్న మంత్రి

సంబేపల్లె : మండల పరిధిలోని మోటకట్ల గ్రామం వంగిమళ్లవాండ్లపల్లెలో సురేష్‌రెడ్డి రైతు పొలంలో హార్టికల్చర్ ప్లాంటేషన్ (టెంకాయ) చెట్లను మంత్రి రాంప్రసాద్‌రెడ్డి సోమవారం నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

40 టన్నుల యూరియా మంజూరు

సిద్దవటం : మండలానికి 40 మెట్రిక్ టన్నుల యూరియా మంజూరైనట్లు మండల వ్యవసాయాధికారి (ఏఓ) కె.రమేష్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మంజూరు అయిన యూరియాను ఆయన పరిశీలించారు. మంగళవారం నుంచి రైతులకు యూరియాను పంపిణీ చేస్తామన్నారు. ఒక బస్తా ధర రూ.266.50 పైసలు అని తెలియజేశారు.

సర్పంచులకు శిక్షణ



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

రాయచోటి టౌన్ : రాయచోటి మండల పరిషత్ కార్యాలయంలో రాయచోటి డివిజన్ పరిధిలోని అన్ని మండాలలకు చెందిన సర్పంచ్‌లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. సోమవారం రాయచోటి మండల పరిషత్ సభాభవనంలో రాయచోటి డివిజన్ పరిధిలోని రాయచోటి, గాలివీడు, లక్కిరెడ్డిపల్లె, గాలివీడు, చిన్నమండెం, సంబేపల్లె, వీరబల్లె, సుండుపల్లె, రామాపురం మండలాలలోని గ్రామాల సర్పంచ్‌లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో డీపీఓ రాధమ్మ ప్రారంభించి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో రాయచోటి ఎంపీడీఓ సురేష్ బాబు, ఈఓపీఆర్‌డీ ఎస్.బాలాజీ పట్నాయక్, ట్రైనర్ నాగభూషణ్ రెడ్డి, సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.


నియామకం



పామూరు దీపక్ రెడ్డి

ఓబులవారిపల్లె : రెడ్డి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ అన్నమయ్య జిల్లా యువజన విభాగం అధ్యక్షుడిగా పామూరు దీపక్ రెడ్డిని నియమించారు. శనివారం ఈ మేరకు రెడ్డి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రపురెడ్డి సురేంద్రారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈసందర్భంగా దీపక్‌రెడ్డిని పలువురు కలిసి అభినందనలు తెలియజేశారు.

వీరభద్రుడికి పల్లకి సేవ



రాయచోటి టౌన్ : రాయచోటి శ్రీ భద్రకాళీ సమేత వీరభద్రస్వామి పల్లకిలో ఊరేగారు. సోమవారం రాత్రి స్వామి, అమ్మవారి మూలవిరాట్‌లకు అభిషేకాలు, పూజలు నిర్వహించి అందంగా అలంకరించారు. అనంతరం ఉత్సవమూర్తులను అలంకరించి పల్లకిలో ఉంచి ఆలయ మాఢవీధుల్లో ఊరేగించారు. పల్లకి సేవలో స్థానిక భక్తులతో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు. పూజలు ఆలయ ఈఓ డివి రమణారెడ్డి ఆధ్వర్యంలో జరిపారు.

చంద్రబాబు మోసాలను ప్రతి గడపకు తీసుకెళ్దాం

- ఏడాదిలో వేధింపులు తప్ప అభివృద్ధి లేదు
- వైఎస్సార్‌సీపీ హయాంలో చేసిన సంక్షేమాన్ని తెలియజేద్దాం
- కష్టపడే ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం
- రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి, కడప మేయర్ సురేష్‌బాబు, కొరముట్ల శ్రీనివాసులు, కొండూరు అజయ్‌రెడ్డి



రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు



కార్యక్రమానికి హాజరైన నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు

రైల్వేకోడూరు అర్బన్ : ఎన్నికల్లో అబద్ధాలతో మోసం చేయడం అధికారంలోకి వచ్చాక వెన్నుపోట్లు పోవడం చంద్రబాబుకు బాగా తెలిసిన విద్య అని జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, రాజంపేట పార్లమెంట్ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ సురేష్‌బాబు, కడప పార్లమెంట్ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ కొండూరు అజయ్‌రెడ్డిలు పేర్కొన్నారు. సోమవారం రైల్వేకోడూరులోని శ్రీ ఫంక్షన్ హాల్‌లో జరిగిన రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమ నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశాన్ని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొరముట్ల శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు చేసిన మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. మేనిఫెస్టోని పవిత్ర గ్రంథంగా భావించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టాక ఏడాదిలోనే పథకాలు అమలు చేసి మాట నిలబెట్టుకున్నాడన్నారు. వైఎస్ జగన్ చేసిన సంక్షేమం కంటే ఎక్కువ ఇస్తాను అని 2024 ఎన్నికల ప్రచారాల్లో చెప్పిన చంద్రబాబు అధికారంలోకి వచ్చాక ఏడాది అయినా పథకాలను అమలు చేయడం లేదని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వ (వైఎస్సార్‌సీపీ) చిత్తశుద్ధిని, ప్రస్తుత చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వ మోసపూరిత విధానాన్ని ప్రజలకు తెలియజేసి చైతన్యపరచాలని నాయకులు, కార్యకర్తలను కోరారు. బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ అని చెప్పిన చంద్రబాబు ఇప్పుడు ప్రజలకు ఏమీ చేయకుండానే అన్ని అమలు చేసేశామని చెబుతుండటంతో ప్రజలు అవాక్కవ్వాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. ఇప్పుడు ప్రజలు పథకాల గురించి అడుగుతే అన్ని అమలు చేశాం.. ఎవరైనా ప్రశ్నిస్తే వారి నాలుక మందం అనడాన్ని వారు తీవ్రంగా తప్పుబట్టారు. బాబు ఇచ్చిన ప్రతి హామీని ప్రజలకు చూపించి ఏ విధంగా మోసం చేశారో తెలియజేయాలని వైఎస్సార్‌సీపీ శ్రేణులకు సూచించారు. టీడీపీ నాయకులు చేసిన అరాచకలను ప్రజలకు గుర్తుచేయాలని తెలియపరిచారు. రెడ్‌బుక్ రాజ్యాంగంలో ఇబ్బందులు ఎదుర్కొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. కష్టపడి పని చేసే ప్రతి కార్యకర్తకు వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ చెప్పినట్టు 2.0లో సముచిత స్థానం ఉంటుందని హామీనిచ్చారు.

దివంగత నేతలకు నివాళులు

ఇటీవల కాలంలో మృతి చెందిన నాయకులు పంజం సుకుమార్‌రెడ్డి, గుంటిమడుగు సుధాకర్‌రాజు, బత్తిన శశికుమార్‌రెడ్డి, యామల రాజ, రఫీ, గుత్తి సురేష్‌లకు నాయకులుఘనంగా నివాళులు అర్పించి పార్టీకి వారు చేసిన సేవలు గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పుల్లంపేట ఎంపీపీ ముద్దా బాబుల్‌రెడ్డి, కోడూరు వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, వత్తలూరు సాయికిషోర్ రెడ్డి, చెవ్వు శ్రీనివాసులురెడ్డి, జెడ్పీటీసీ రత్నమ్మ, తోట శివసాయి, జిల్లా యువజన అధ్యక్షులు ఎలకచర్ల శివప్రసాద్‌రెడ్డి, సీహెచ్ రమేష్, మందల నాగేంద్ర, అన్వర్‌బాషా, మారెళ్ల రాజేశ్వరి, భరత్‌కుమార్‌రెడ్డి, సిద్దయ్య, నందబాల, ముస్తాక్, డీవీరమణ, రత్తయ్య, సుబ్బరామరాజు, బండారు మల్లి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఎవరో ప్రజలకు తెలియడంలేదు

రైల్వేకోడూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఎవరో తెలియడంలేదని కొరముట్ల శ్రీనివాసులు ఎద్దేవా చేశారు. ప్రస్తుత ఎమ్మెల్యేని డమ్మీచేసి ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు పెత్తనం చేలాయిస్తున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వంలో నియోజకవర్గానికి ఏ ఒక్క కొత్త పనిని తీసుకురాకపోగా మన హయాంలో ప్రారంభించి వివిధ దశల్లో ఉన్న పనులను అడుగు కూడా ముందుకు పడటంలేదంటే కూటమి నాయకుల అభివృద్ధిపై చిత్తశుద్ధి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ కార్యకర్త ప్రతి గడపకు ప్రభుత్వ మోసాలను తీసుకెళ్లాలని కోరారు. నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులు బనాయించి వేధిస్తున్నారని, వైఎస్సార్‌సీపీ నాయకులను వేధించడంలో ఉన్న శ్రద్ధ నియోజకవర్గ అభివృద్ధిపై చూపాలని ప్రభుత్వానికి, కూటమి నియోజకవర్గ నాయకులకు సూచించారు.

10న పేరెంట్స్, టీచర్స్ మీట్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ చంద్ర

గాలివీడు : మండలవ్యాప్తంగా ఈనెల 10వ తేదీన నిర్వహించే మెగా పేరెంట్స్ టీచర్స్ (పీటీఎం) కార్యక్రమాన్ని పండగా వాతావరణంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ చంద్ర మౌళీశ్వర్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి ఆదేశానుసారం జిల్లా కలెక్టర్ శ్రీధర్ ఛామకూరి మెగా పీటీఎం కార్యక్రమంపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమన్వయంతో పాఠశాలలను మరింత బలోపేతం చేసే దిశగా కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందన్నారు.

పాఠశాలల దోపిడీ అరికట్టాలి

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలో ప్రైవేటు పుస్తకాల పబ్లిషర్లతో కలిసి కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు చేస్తున్న దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేస్తూ సోమవారం బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు డి.రెడ్డిబాబు మాట్లాడుతూ ప్రభుత్వ ఎయిడెడ్ విద్యా సంస్థల్లోని విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా పాఠ్య పుస్తకాలు అందిస్తున్నదన్నారు. కానీ, ప్రభుత్వం నిర్దేశించిన పాఠ్య పుస్తకాలకు అదనంగా బండెడు పుస్తకాలను ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నాయని తెలిపారు. అనుమతులు లేకుండా ఇరుకైన భవనాల్లో విద్యా సంస్థలను నిర్వహిస్తున్నారని ఆరోపించారు.

విస్తృత సేవా కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు

- నేడు దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి
- వైఎస్సార్‌సీపీ శ్రేణులు పెద్దసంఖ్యలో హాజరవ్వాలని నాయకుల పిలుపు



సాక్షి, నెట్‌వర్క్ : ప్రజల గుండెల్లో చెరిగిపోనిముద్ర వేసేలా దివంగత ముఖ్యమంత్రి డా. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పరిపాలన సాగించారని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి (సంబేపల్లె), వివిధ మండలాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు ఉదయ్‌కుమార్‌రెడ్డి(సంబేపల్లె), ముస్తాక్(పుల్లంపేట), సింగం నీలకంఠారెడ్డి(సిద్దవటం)లు అన్నారు. మంగళవారం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతిని పురస్కరించుకుని అన్ని మండలాలు, పంచాయతీలలోని ఆయన విగ్రహాల వద్ద ఘనంగా నివాళులర్పించడమే కాకుండా విస్తృత సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు సోమవారం వారు వేర్వేరు ప్రకటనల్లో విలేకరులకు తెలియజేశారు. వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దసంఖ్యలో వైఎస్ఆర్ జయంతి వేడుకల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కాగా సిద్దవటం మండలం భాకరాపేట మూడు రోడ్ల కూడలిలో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి నివాళి అర్పించే కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథరెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి తదితరులు హాజరవుతున్నట్లు సిద్దవటం మండల నాయకులు పేర్కొన్నారు. కాగా ఒంటిమిట్టలో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు టక్కోలు శివారెడ్డి, సీనియర్ వైఎస్సార్‌సీపీ నాయకులు ఈగ హరినాథరెడ్డిలు ప్రకటనలో తెలియపరిచారు. సుండుపల్లెలో జరిగే కార్యక్రమానికి పార్టీ శ్రేణులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రామస్వామిరెడ్డి కోరారు.

విద్యే మనిషిని ఉన్నత స్థాయిలో నిలుపుతుంది



విద్యార్థులకు మెటీరియల్‌ను పంపిణీ చేస్తున్న దాత

రాయచోటి టౌన్ : విద్యే మనిషిని ఉన్నత స్థాయిలో నిలుపుతుందని మున్సిపల్ కౌన్సిలర్ కసిరెడ్డి వెంకట నరసింహారెడ్డి అన్నారు. సోమవారం రాయచోటి రూరల్ పరిధిలోని వరిగ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకట్రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు విశ్వనాథరెడ్డి, రామాంజుల రెడ్డి, బూత్ కన్వీనర్ సుబ్బారెడ్డి, వైఎస్సార్ సీపీ రాయచోటి పట్టణ ఉపాధ్యక్షులు మోతుకూరి నాగేంద్ర, అరుణ్ కుమార్ రెడ్డి, శివాంజనేయులు, ప్రసాద్, జయచంద్ర, శ్రీను, చంద్రమోహన్‌రెడ్డి, ధన, చెంద్రాయుడు, సీతారామయ్య, వెంకటేశ్వర్లు, టీచర్లు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ

పెనగలూరు : మండల కేంద్రమైన పెనగలూరులో ఎమ్మార్పీఎస్ జెండాను సోమవారం ఆవిష్కరించారు. ఎమ్మార్పీఎస్ నాయకులు రాధాకృష్ణ, నగిరిపాటి చెంగయ్య, పశుపులేటి జయరామయ్య, పి.బద్రీ, పి వెంకటేష్, రమణ, వెంగయ్య, వెంకటరమణయ్య, శ్రీనివాసులు, మహేష్‌లతోపాటు పలువురు కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

'మానవత'కు చేయూతనిస్తాం



దాతను సన్మానిస్తున్న మానవత సభ్యులు

రాయచోటి టౌన్ : మానవత స్వచ్ఛంద సంస్థ రాయచోటి శాఖ ఆధ్వర్యంలో జరిపే సేవా కార్యక్రమాలకు చేయూతనిస్తామని మార్కెట్ కమిటీ మాజీ సెక్రటరీ చమర్తి అచ్చిరాజు అన్నారు. సోమవారం ప్రతిభా జూనియర్ కళాశాలలో జరుగుతున్న మానవత సంస్థ సభ్యత్వ నమోదులో అచ్చిరాజు దంపతులు శాశ్వత సభ్యత్వం పొంది, సంస్థ సేవా కార్యక్రమాలకు రూ.25 వేలను అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు దాతను సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ చైర్మన్ అరమాటి శివగంగిరెడ్డి, అధ్యక్షులు జయచంద్రారెడ్డి, ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు చింతంరెడ్డి వెంకట్రామిరెడ్డి, గౌరవ అధ్యక్షులు గాండ్లపెంట ఖాదర్ బాషా, మాజీ సెక్రటరీ గాలివీటి సుదర్శన్‌రెడ్డి, డైరెక్టర్స్ మేకల శివారెడ్డి, కేతంరెడ్డి హరినాథరెడ్డిలు పాల్గొన్నారు.

వ్యవసాయాన్ని పండుగ చేసింది వైఎస్సార్

రాయచోటి టౌన్ : పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన వ్యక్తి మహానేత, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం డాక్టర్ వైఎస్ఆర్ జయంతిని పురస్కరించుకుని ఆయన చేసిన సేవలను స్మరించుకుంటూ సోమవారం పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేశారు. మండుటెండలో సుదీర్ఘ పాదయాత్ర చేపట్టి పేద, మధ్య తరగతి ప్రజల కష్టాలు తెలుసుకుని వారికి అండగా నిలిచేలా పథకాలు ప్రవేశపెట్టిన నాయకుడు వైఎస్సార్ అని చెప్పారు. ఆయన సంకల్ప బలంతోనే నేటికి కుయ్.. కుయ్ అంటూ 108, 104 వాహనాలు రోడ్డుపై తిరుగుతున్నాయని పేర్కొన్నారు. పేదలకు కార్పొరేట్ వైద్యాన్ని ఆరోగ్యశ్రీ ద్వారా చేరువ చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. చదువులతోనే పేద కుటుంబాల అధ్వాన స్థితిని బాగు చేయవచ్చని భావించి ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రారంభించింది వైఎస్సార్ హయాంలోనే అని గుర్తు చేశారు. చంద్రబాబు పాలనలో (1995–2004) వ్యవసాయం దండగా అనే స్థితి నుంచి వ్యవసాయం అంటే పండుగ అని చేసి చూపింది ఆయన స్ఫూర్తే అని తెలియజేశారు. అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూర్చి వారి గుండెల్లో చిరస్థాయిగా నిలించిపోయారన్నారు.

రాయచోటి అభివృద్ధి ప్రదాత

కరువు ప్రాంతమైన రాయచోటి అభివృద్ధికి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే బాటలు పడ్డాయన్నారు. ఈ ప్రాంతంలో వెలిగల్లు, ఝరికోన, శ్రీనివాసపురం ప్రాజెక్టులను నిర్మించిన ఘనత ఆయనకే చెల్లుతుందన్నారు. అలాగే ఎన్నో తరాలుగా ఉన్న రాయచోటి ప్రజల దాహార్తిని తీర్చాడన్నారు. రింగ్ రోడ్డు, పాలిటెక్నిక్ కళాశాలతో పాటు ఎన్నో విద్యాసంస్థలను అభివృద్ధి చేశారని శ్రీకాంత్‌రెడ్డి ప్రకటనలో తెలియజేశారు.

నేడు, రేపు మంచినీటి సరఫరా బంద్

రాజంపేట : రాజంపేట పట్టణంలో మంగళవారం, బుధవారం అన్నమయ్య భారీ నీటి పథకం నుంచి వచ్చే నీరు సరఫరా నిలిపివేస్తున్నట్లు పురపాలక సంఘం కమిషనర్ జి.శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని నూనెవారిపల్లె రోడ్డు మున్సిపాలిటీ పార్కు వద్ద 500 కేఎంఎల్, 1000 కేఎంఎల్ అవుట్‌లెట్ పైపులైను మరమ్మతు కారణంగా మంచినీరు సరఫరా నిలిపివేయాల్సి వచ్చిందన్నారు. పట్టణవాసులు పురపాలక సంఘానికి సహకరించాలన్నారు. ముందు జాగ్రత్తగా మంచినీరు నిల్వ చేసుకోవాలని కోరారు.

నీటి సరఫరా నిలిచే ప్రాంతాలు ఇవే..

పట్టణంలోని ఉస్మాన్‌నగర్, ఆర్‌అండ్‌బీ బంగ్లా, కొలిమివీధి, లక్ష్మీనగర్, ఎగువగడ్డ, నలంద కాలేజీ ఏరియా, నూనివారిపల్లెరోడ్డు, సుద్దగుంతలు, బాలాజీ నగర్, ఆకులవీధి, కనకమ్మ సందు, గడ్డివీధి, భవానీ నగర్, శాంతినగర్, బండ్రాళ్ల వీధి, హైదర్ నగర్, అమ్మవారిశాల వీధి, ఎర్రబల్లి, విద్యుత్‌నగర్, బలిజపల్లె, రాజుస్కూల్ రోడ్డు, వైఎస్ఆర్ నగర్, లక్ష్మీనగర్, రసూల్ నగర్, గణేష్ నగర్, రాజుగారివీధి, సాయినగర్‌లలో నివాసీయులకు మంచినీరు సరఫరా ఉండదని కమిషనర్ వివరించారు.

కార్మికులను బానిసలు చేసేందుకు కుట్ర



జిల్లా కలెక్టరేట్ ఎదురుగా ర్యాలీలో పాల్గొన్న కార్మిక సంఘాల నాయకులు

రాయచోటి టౌన్ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికులను కార్పొరేట్లకు బానిసలుగా చేసే కుట్రలు చేస్తోందని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు ఆరోపించారు. సోమవారం సీఐటీయూ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు రాయచోటి పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం నుంచి మున్సిపల్, గ్రామ పంచాయతీ, విద్యుత్ కార్మికులతో కలసి కలెక్టరేట్ వరకు బైకులపై ర్యాలీగా వెళ్లారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లేబర్ కోడ్‌లు అమలు అయితే యూనియన్‌ల రిజిస్ట్రేషన్లు ఉండవని, జీతాల చెల్లింపులు మూడు, నాలుగు నెలలు గడిచినా చెల్లించకుంటే ఆందోళనలు చేయకూడదనే అంక్షలు పెట్టడం దారుణమన్నారు. జూలై 9వ తేదీన జరిగే సమ్మెలో పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొంటారని తెలియజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బివి రమణ, అక్బర్, శంకరయ్య, రమేష్, విద్యుత్ సంఘం రాష్ట్ర నాయకులు ఏవీ రమణ, మోహన్, హమాలీ నాయకులు మాధవయ్యలు పాల్గొన్నారు.

ఏసీఎల్ విజేత చింతకాయలపల్లి జట్టు



విజేతకు ట్రోఫీ అందజేస్తున్న ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి, నిర్వాహకులు

నందలూరు : మండలంలోని అరవపల్లిలోని జెడ్పీ హెచ్‌ఎస్‌లో ఆసక్తికరంగా సాగిన అరవపల్లె క్రికెట్ లీగ్ సీజన్-1 ముగిసింది. సోమవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో అరవపల్లెకు చెందిన ఫాల్కన్ లెవన్స్ జట్టు, చింతకాయలపల్లె జట్టు తలబడ్డాయి. ఇందులో చింతకాయలపల్లె జట్టు విజయం సాధించి లీగ్ విజేతగా నిలిచింది. మొదట టాస్ గెలిచి అరవపల్లెకు చెందిన ఫాల్కన్ లెవెన్స్ జట్టు మొదట బ్యాటింగ్ చేసే నిర్ణీత 14 ఓవర్లలో 9 వికెట్లను కోల్పోయి 76 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్‌కు దిగిన చింతకాయలపల్లి జట్టు 11.4 ఓవర్లలో 7 వికెట్లను కోల్పోయి టార్గెట్‌ను ఛేదించింది. విజేత జట్టులోని ఆటగాళ్లు రూపేష్ 3 వికెట్లను తీసి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌ను సొంతం చేసుకొన్నాడు. ప్రతి మ్యాచ్‌లో ప్రతిభ కనపరిచిన ఈరి శివ మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌ను సొంతం చేసుకున్నాడు. బహుమతి ప్రదానోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి విజేతలకు రూ.30 వేలు, ట్రోఫీని అందజేశారు. జనాబ్ ఎస్టీ ఖాన్ చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు కలీముల్లాఖాన్, షమీవుల్లాఖాన్‌లు రూ.30 వేలను, విజేత ట్రోఫీని గుణయాదవ్‌లు అందజేశారు. రన్నర్స్‌కి ఒరాకిల్ సాఫ్ట్‌వేర్ బృందం రూ.20 వేలు అందజేయగా, రన్నర్స్ ట్రోఫీని ఎంబలూరు ప్రదీప్‌కుమార్‌లు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ మండల మహిళా అధ్యక్షురాలు పల్లె మాధవి, స్వర్ణాంధ్ర సంస్థ అధ్యక్షులు వేపగుంట శ్యామ్‌రాజ్, స్వామి ఏలుమలై, రెమో సురేష్, మురళి, ఏసీఎల్ కమిటీ సభ్యులు బుల్లెట్ హరి, అరుణ్, మల్లెం రాము తదితరులు పాల్గొన్నారు.

దారి ఏర్పాటుకు చర్యలు తీసుకోండి



కలెక్టరేట్ వద్ద సీపీఐ నాయకుల నిరసన

రాయచోటి జగదాంబసెంటర్ : రాయచోటి నియోజకవర్గం గాలివీడు మండలం అరవీడు గ్రామ పరిధిలోని నడింపల్లెకు దారి సౌకర్యం కల్పించాలని సోమవారం అన్నమయ్య జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు మాట్లాడుతూ గత 100 సంవత్సరాలుగా అరవీడు కస్బా నుంచి నడింపల్లెకు సర్వే నెంబర్ 413లో 2.15 సెంట్ల భూమి 100 మీటర్ల స్థలంలో రోడ్డు ఉండేది అన్నారు. భూమి యజమాని రోడ్డు ఇచ్చేందుకు నిరాకరిస్తున్నందున ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రెవెన్యూ అధికారులు చొరవ చూపి నడింపల్లి దారి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవకు ఈకేవైసీ తప్పనిసరి

రాజంపేట రూరల్ : అన్నదాత సుఖీభవ పొందేందుకు రైతులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని సహాయ వ్యవసాయ సంచాలకులు కె.శివశంకర్ తెలిపారు. స్థానిక డివిజనల్ వ్యవసాయ శాఖ కార్యాలయంలో సోమవారం విలేకరులతో సమావేశంలో ఆయన మాట్లాడారు. పథకానికి సంబంధించి ఏవైనా ఫిర్యాదులు ఉంటే ఆ గ్రామ రైతు సేవా కేంద్రంలో సిబ్బందిని రైతులు సంప్రదించాలన్నారు. రైతులు వారి పట్టాదార్ పాసు పుస్తకంలో ఆధార్ లింక్‌ను తహసీల్దార్ కార్యాలయాల్లో చేయించుకోవాలని సూచించారు. లింక్ పూర్తిచేసిన రైతులు రైతు సేవా సిబ్బందిని సంప్రదించాలన్నారు. ఈకేవైసీ చేయించుకోకుంటే పీఎం కిసాన్ పథకం కింద నగదు జమ కాదని తెలియజేశారు. రాజంపేట, నందలూరు, పెనగలూరు మండలాల పరిధిలో అన్నదాత సుఖీభవకు 14,186 మంది రైతులు ఎంపికయ్యారని, వారిలో 13,436 మంది రైతులు లబ్ధిపొందనున్నట్లు పేర్కొన్నారు. ఇక మిగిలిన 3090 రైతులు తమ రైతు సేవా కేంద్ర సిబ్బందిని సంప్రదించాలన్నారు. ఈ నెల 13వ వరకు రైతులు లోపాలను సరిచేసుకునేందుకు అవకాశం ఉందన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ నరసింహారెడ్డి

వీరబల్లి : రాయచోటి- వీరబల్లి మార్గంలో మట్లి ఎల్లంపల్లి వద్ద స్థానిక ఎస్ఐ నరసింహారెడ్డి తన సిబ్బందితో కలిసి సోమవారం సాయంత్రం వాహనాల తనిఖీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వాహనాలను ఆపి సంబంధిత రికార్డులను పరిశీలించారు. అలాగే డ్రైవర్లకు ముఖ్యంగా లైసెన్సులు ఉండాలని సూచించారు. ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ఎవరైనా ట్రాఫిక్ రూల్స్ అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గిరిజనులు అభివృద్ధి వైపు నడవాలి



మహిళలతో మాట్లాడుతున్న రామచంద్రయ్య

చిట్వేలి : గిరిజనులు అభివృద్ధి వైపు నడవాలని రైల్వేకోడూరు నియోజకవర్గం (వైటీడీపీ) ఏపీఎం రామచంద్రయ్య అన్నారు. సోమవారం ఆయన మారుమూల గిరిజన గ్రామాలైన రాజుకుంట, చెర్లోపల్లి, అనుంపల్లి కాలనీలలో పంచాయతీ కార్యదర్శి రమణయ్యతో కలిసి పర్యటించారు. పాత అనుంపల్లి గిరిజన కాలనీలో మహిళలతో మాట్లాడుతూ జీవనోపాధి మెరుగుపరుచుకోవాలని, వన్‌ధన్ వికాస్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలానే పాదుపు సంఘాల ద్వారా జరిగే లబ్ధిని వివరించారు. ఆధార్ కార్డు లేని వారికి చేయించడానికి కృషి చేస్తామన్నారు. అలాగే ప్రతి గిరిజన కాలనీలో స్వయం సహాయక సంఘాలు చర్యలు తీసుకుంటామని చెప్పారు. గిరిజన కాలనీలపై ప్రత్యేక దృష్టి పెడతామని, ప్రభుత్వ లక్ష్యాన్ని సాధిస్తామన్నారు. కార్యక్రమంలో వైద్య సంక్షేమ సహాయకులు మణికృష్ణ, రమణ తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యలు పరిష్కరించండి



తహసీల్దార్‌కు అర్జీలు ఇస్తున్న రైతులు, మహిళలు

ఓబులవారిపల్లె : ప్రజల నుంచి వచ్చిన అర్జీలు క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని తహసీల్దార్ యామినీ రెడ్డి సిబ్బందిని ఆదేశించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల నుంచి వచ్చిన రైతులు, ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఇందులో ప్రధానంగా భూములకు సంబంధించి ఆన్‌లైన్, రేషన్ కార్డులు, ఒంటరి మహిళ తదితర అంశాలపై అర్జీలను ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన వినతులను సత్వరమే పరిశీలించి పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్ఐ మల్లికార్జున రెడ్డి, సర్వేయర్ నాగలక్ష్మి, వీఆర్ఓలు తదితరులు పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయాలి

రైల్వేకోడూరు అర్బన్ : ఈనెల 9న (రేపు) జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులు సీహెచ్ చంద్రశేఖర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

నీటి గుండంలో అపరిశుభ్రత తొలగింపు



పంచలింగాల గుడి వద్ద ఉన్న కోనేరులో వ్యర్థాలు, పూడికతీత పనులు చేస్తున్న కూలీలు

సిద్దవటం : మండలంలోని వంతాటిపల్లె గ్రామ సమీపంలోని శ్రీ లంకమల అడవుల్లో వెలసిన శ్రీ నిత్యపూజస్వామి కోన, పంచలింగాల వద్ద ఉన్న నీటి గుండంలో ఉన్న అపరిశుభ్రత తొలగింపు చర్యలు చేపట్టామని ఆలయం ఇన్‌చార్జి ఈఓ శ్రీధర్ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ కూలీల సహాయంతో నీటి గుండాలలో, పంచలింగాల వద్ద ఉన్న కోనేరులో ఉన్న అపరిశుభ్రతను తొలగించి బ్లీచింగ్ పిచికారీ చేయించి క్లోరినేషన్ చేశామన్నారు. కార్యక్రమంలో ఆలయ ఉద్యోగి చంద్ర, కూన విజయభాస్కర్, ఆలయం మాజీ చైర్మన్ బండి మునిరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.